# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 18-07-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శ్వేతపత్రం విడుదల చేయనున్నారు.**
2. **తెలంగాణలో 3 విడతల్లో రుణమాఫీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, ఏఐ, డేటా సెంటర్ క్లస్టర్ విస్తరణకు నాస్కామ్‌కు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆహ్వానం పలికారు.**
4. **తెలంగాణలో ఈ ఏడాది కొత్తగా 6.5లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.**
5. **అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో మోస్తరు నుంచి భారి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు మధ్యాహ్నం 3గంటలకు శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. రాష్ట్ర సచివాలయంలో శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గడచిన ఐదేళ్లలో శాంతిభద్రతలపై రాష్ట్రంలో వ్యవహరించిన తీరు, అక్రమ కేసులు, పౌరులపై నమోదైన కేసులు తదితర అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయనున్నారు.

--------------------------

తెలంగాణలో 3 విడతల్లో రుణమాఫీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో పార్లమెంట్, శాసనసభ, శాసనమండలి సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీపై ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈరోజు సాయంకాలం రుణమాఫీ నిధులు విడుదల చేస్తామని చెప్పారు. తొలి విడతగా లక్ష రూపాయల వరకు ఉన్న రైతు రుణాలకు నిధుల విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోపు లక్షా 20 వేల రూపాయల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామన్నారు. తర్వాత 2 లక్షల రూపాయల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి వివరించారు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే రుణమాఫీ చేయనున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

--------------------------

ఆగస్టు నెల దాటకుండానే రైతు రుణమాఫీ పూర్తి చేస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాదులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రుణమాఫీ హామీని అత్యంత పారదర్శకంగా అమలు చేయనున్నామని తెలిపారు. రేషన్‌కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు కూడా రుణమాఫీ అందిస్తామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, ఏఐ, డేటా సెంటర్ క్లస్టర్ విస్తరణకు నాస్కామ్‌కు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆహ్వానం పలికారు. రాష్ట్రంలో ఐటీ, ఐటీ సేవలు, ఏఐ, డేటా సెంటర్ క్లస్టర్‌కి వ్యాపారాలను విస్తరించుకోవచ్చని, విశాఖలో ఏఐ, డేటా సెంటర్ ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉందని నాస్కామ్‌కు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. తమ వ్యాపారాలను ఆంధ్రప్రదేశ్ కు బదిలీ చేసుకోవచ్చని లోకేష్ ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అత్యుత్తమ సౌకర్యాలు, నిరంతర విద్యుత్, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నాస్కామ్ ఐటీ సంస్థకు... ప్రభుత్వం నుంచి పరిమితులు లేని నైపుణ్యం కలిగిన ప్రతిభను అందిస్తామని లోకేష్ వెల్లడించారు.

---------------------------

జాతీయ హెల్త్ మిషన్ కార్యక్రమం కింద ఆంధ్ర ప్రదేశ్‌కు వెయ్యి కోట్ల రూపాయల మొత్తాన్ని అందజేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిన్న ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా, పలువురు కేంద్ర మంత్రులను కలుసుకున్న అనంతరం ఆయన పాత్రికేయులకు ఈ విషయం తెలియజేస్తూ..... రాష్ట్రంలో ఆరోగ్య మందిర్‌ల నిర్మాణానికి ఈ నిధులు సమకూర్చాలని కోరానని చెప్పారు. ఆరోగ్య రంగంలో గత 40 రోజులలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వానికి వివరించానని తెలిపారు. గత ప్రభుత్వ విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగం తీవ్రంగా నష్టపోయిందని, 11 బోధనా వైద్య కళాశాలలు ఉండగా, ఆరు కళాశాలలలో మాత్రమే కేటలాగ్‌లు వున్నాయని, మిగతా కళాశాలలకు వీటిని మంజూరు చేయాలని, క్యాన్సర్ వ్యాధి నివారణ కోసం మరిన్ని కేంద్రాలు మంజూరు చేయాలని కూడా కేంద్రానికి విజ్ఞప్తి చేశానని సత్యకుమార్ వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన ఏపిఈఏపి సెట్– 2024 కౌన్సిలింగ్‌లో తొలివిడత సీట్ల కేటాయింపు పూర్తి చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ సంచాలకులు, ప్రవేశాల కన్వీనర్ డాక్టర్ బి. నవ్య నిన్న తెలిపారు. ఏపిఈఏపి సెట్‌లో అర్హత సాధించిన 1,86,031 మందిలో తొలి విడత కౌన్సిలింగ్ కోసం లక్షా 28 వేల 619 మంది దరఖాస్తు చేసుకున్నారని ధ్రువపత్రాల పరిశీలన అనంతరం లక్షా 28 వేల 65 మంది అర్హత సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. మిగిలిన 19 వేల 524 సీట్లను రెండో విడతలో భర్తీ చేయనున్నామని అధికారులు వెల్లడించారు.

---------------------------

తెలంగాణలో ఈ ఏడాది కొత్తగా 6.5లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హైదరాబాదులోని జలసౌధలో నీటిపారుదల శాఖ

అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటి పారుదల శాఖలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జలవనరుల శాఖలో పదోన్నతులు, బదిలీలు త్వరలోనే చేపడతామని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, బీమా, నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

-------------------------

జాతీయ స్థాయి విద్యా విధానం కింద అమలు జరుగుతున్న సంస్కరణల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని పాఠశాలలలో ఈ నెల 22 వ తేదీ నుండి "శిక్షా సప్తాహ్" కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర విద్యా శాఖ ఆదేశించింది. ఈ నెల 28 వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లులను భాగస్వాములను చేయాలని సూచించింది. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం కింద 22వ తేదీన స్థానిక వనరులతో బోధనా సామగ్రి ప్రదర్శన, 23న పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల కార్యక్రమం, 24న క్రీడా పోటీలు నిర్వహించడం, 25న సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టాలని, 2న సాంస్కృతిక నైపుణ్యాల దినోత్సవం నిర్వహించాలని, 27న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం కూడా నిర్వహించాలని పాఠశాలలను ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ ఆదేశించింది.

-------------------------

తెలంగాణలో ఉపాధ్యాయుల నియామకం కోసం చేపట్టనున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష, డిఎస్సి ఈరోజు నుంచి మొదలు కానుంది. మొత్తం 11 వేల 62 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం 2 లక్షల 79 వేల 957 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్ పరీక్షకు 1.60 లక్షల మంది, సెకండరి గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టుల కోసం 80 వేల మంది ధరకాస్తూ చేసుకోగా మిగతా వారిలో భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. తొలిసారిగా కంప్యూటర్ ఆధారంగా జరిగే ఈ పరీక్ష కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పరీక్షకు బయో మెట్రిక్ విధానాన్ని అమలు చేయనున్న నేపధ్యంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని విద్యాశాఖ సూచించింది.

-------------------------

సూపర్ సిక్స్ ఎన్నికల హామీలలో భాగంగా ప్రకటించిన నిరుద్యోగ భృతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ కార్మిక, కర్మాగార, బాయిలర్స్, వైద్య బీమా సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయంలో నిన్న జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు కర్మాగారాలలో జరిగిన ప్రమాదాల పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన లైసెన్సుల వల్ల ఇలా జరిగిందని అన్నారు. పరిశ్రమలలో నిర్వహించే సేఫ్టీ అడిట్ పై సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో విశ్లేషణ చేస్తామని, అన్ని ఫ్యాక్టరీలు, బాయిలర్స్ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు.

-------------------------

అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న రెండ్రోజులపాటు కోస్తాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. తీర ప్రాంతాల్లో ఈదురుగాలులు వీచే సూచనలున్నాయని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భారీ వర్షాలపై అత్యవసర సహాయం కోసం 1070, 112, నంబర్లకు కాల్ చేయాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు తెలిపారు.

మరో వైపు తెలంగాణలో ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది.

======================